
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నంద్యాల
జిల్లా వార్తలు
శుక్రవారం 21 జూన్ 2024





ఆరోగ్య యోగం

- యోగాతో సంపూర్ణ ఆరోగ్యం
- నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం
- కర్నూలు ఔట్‌డోర్ స్టేడియంలో యోగా ప్రదర్శన




యోగా అంటే ఏమిటి ..?

యుజ్ అనగా కలయిక అనే ధాతువు నుంచి యోగ లేదా యోగం అనే పదం ఉత్పన్నమైంది. ఇంద్రియాలను వశపరుచుకుని మనసును లగ్నం చేయడం యోగాలో కీలకం. ఇతర వ్యాయామాల కంటే పూర్తిగా భిన్నమైనది యోగాభ్యాసం. దీనిలో నిబిడీకృతంగా ఉన్న ఆధ్యాత్మిక భావం కారణంగా దేశవిదేశాల్లో విశేష ప్రాచుర్యాన్ని సంతరించుకుంది. మానసిక ఏకాగ్రత వల్ల మానసిక ప్రశాంతతను అందిస్తుంది. తద్వారా మానసిక, శారీరక ఆరోగ్యానికి దోహపడుతోంది.

ఆత్మకూరు, జూన్ 20: ప్రాచీన భారతీయ సాంప్రదాయంలో యోగా అమూల్యమైనది. ఆధునిక జీవితంలోని ఒత్తిడిని అధిగమించేందుకు యోగా అత్యవసరం. శారీరక శ్రమ లేకపోవడం వల్ల నిద్రలేమి, మధుమేహం, రక్తపోటు, గుండె సమస్యలు, ఆస్తమా, గ్యాస్ట్రిక్, థైరాయిడ్, కీళ్లనొప్పులు, స్థూలకాయం వంటి దీర్ఘకాలిక వ్యాధులు పెరిగిపోయాయి. వీటన్నిటికీ యోగా పరిష్కారం అనే భావన పెరిగింది. అన్ని వయసులవారు, అన్ని రంగాల్లో పని చేస్తున్నవారు యోగ సాధన చేస్తున్నారు. యోగాకు ఇటీవల ప్రపంచ గుర్తింపు వచ్చింది. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా శుక్రవారం యోగా డే వేడుకలు నిర్వహిస్తున్నారు. కర్నూలులోని ఔట్‌డోర్ స్టేడియంలో ఆయుష్ శాఖ, డీఎస్ఏ, కర్నూలు నగర పాలక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో యోగాసనాలు నిర్వహిస్తారు. యోగా, ధ్యానం ఆధ్యాత్మిక సాధనకు, మానసిక ఆరోగ్యానికి చక్కగా తోడ్పడుతోంది. హఠయోగంలో భాగమైన ఆసనాలు శరీరారోగ్యానికి తోడ్పడి దేహదారుఢ్యాన్ని, ముఖ ఛాయను ఇనుమడింపజేస్తాయి. భారత ప్రధాని నరేంద్రమోదీ చొరవతో 2015 జూన్ 21వ తేదిన అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని తొలిసారిగా నిర్వహించారు. ఐక్యరాజ్యసమితి యోగా దినోత్సవం సందర్భంగా ఈ ఏడాది వ్యక్తిగత, సమాజ ఆరోగ్యం కోసం యోగా అనే నినాదాన్ని ఇచ్చింది.



45 నిమిషాలు సామూహిక యోగా ప్రదర్శన



10వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శుక్రవారం కర్నూలు ఔట్‌డోర్ స్టేడియంలో 45 నిమిషాలు సామూహిక యోగా ప్రదర్శన ఉదయం 6 నుంచి 8.30 గంటల వరకు నిర్వహిస్తారు. విద్యార్థులు నిత్యం యోగాసనాలు చేయడం వల్ల ఏకాగ్రత పెరుగుతుంది.

- డా.కేవీఎన్ ప్రసాద్, మెడికల్ ఆఫీసర్, యోగా నేచురోపతి (ఆయుష్), హుసేనాపురం

మనస్సును నియంత్రించేది యోగా



మనస్సును, శరీరాన్ని నియంత్రించేది యోగా. యోగాతో శారీరక వ్యర్థ పదార్థాలు వైదొలుగుతాయి. కరోనాను ఎదుర్కొనేందుకు అప్పుడు బ్రీతింగ్ ఎక్సర్‌సైజ్‌గా ప్రాణాయామం ఎంతో ఉపయోగపడింది. 6 సంవత్సరాల నుంచి 65 సంవత్సరాల వయస్సు వున్న వారు యోగా చేయవచ్చు.

- డా. ద్వారం ప్రభాకర్ రెడ్డి, సీనియర్ మెడికల్ ఆఫీసర్, కర్నూలు ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల

మానసిక ప్రశాంతత లభిస్తుంది



జిల్లాలో పతంజలి యోగా సమితి, భారత్ స్వాభిమాన్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచితంగా యోగా శిక్షణ యోగా శిక్షకులను తయారు చేస్తున్నాం. శ్రీశైలం దేవస్థానంలో జరిగే యోగాడే కార్యక్రమంలో పతంజలి యోగా సమితి ద్వారా పాల్గొంటారు.

- ఎస్‌వీ శివరాజ్, యోగా గురువు, జిల్లా అధ్యక్షుడు, పతంజలి యోగా సమితి, కర్నూలు



ఎకరాకు రూ.10 వేల పరిహారం ఇవ్వండి

కేంద్ర కరువు బృందానికి రైతుల విన్నపం



మాట్లాడుతున్న వ్యవసాయాధికారి నిరంజన్

కోవెలకుంట్ల, జూన్ 20: ఎకరాకు రూ.10 వేల నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని కేంద్ర కరువు బృందానికి రైతులు విజ్ఞప్తి చేశారు. గురువారం కోవెలకుంట్ల మండలంలోని భీమునిపాడు గ్రామంలో చౌడేశ్వరి దేవి ఆలయ సమీపంలో రైతులతో కేంద్ర కరువు బృందం ముఖాముఖి కార్యక్రమం జరిగింది. జాయింట్ కలెక్టరు రాహుల్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. కేంద్ర కరువు బృందమైన ఐఏఎస్ అధికారులు డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎక్స్‌పెండేచర్ సహాయకులు చిన్మయ గాట్మేర్, సాగు నీరు, పారిశుధ్య శాఖ డిప్యూటీ సంచాలకులు అశిఫ్‌పాండే, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి అరవింద్‌కుమార్ సోనీ పాల్గొని రైతులతో చర్చించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ పంట నష్ట పరిహారాన్ని ఎకరాకు రూ.4వేల నుంచి రూ.10వేలకు పెంచాలని కోరారు. అలాగే కరువు వల్ల శనగ, జొన్న పంటల దిగుబడి 75 శాతం వరకు తగ్గిపోయి ఉన్నందున సాగు చేసిన ప్రతి ఎకరాకు బీమా సదుపాయం ఇచ్చి ఆదుకోవాలని కోరారు. పంట నష్టపరిహారాన్ని రెండు హెక్టార్ల నుంచి నాలుగు హెక్టార్ల వరకు పెంచాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ అగ్రికల్చర్ ఆఫీసరు మురళీక్రిష్ణ, కోవెలకుంట్ల, నందికొట్కూరు, ఆళ్లగడ్డ వ్యవసాయ సహాయ సంచాలకులు, వ్యవసాయాధికారులు, కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్తలు, డాట్ ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త కోఆర్డినేటరు రామక్రిష్ణారావు పాల్గొన్నారు.

కరువు పరిస్థితిపై ఫొటో ఎగ్జిబిషన్

నంద్యాల (కల్చరల్): నంద్యాల జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలోని కరువు పరిస్థితిపై గురువారం ఫొటో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. ఈ ఎగ్జిబిషన్‌ను జిల్లా కలెక్టర్ డా.కె. శ్రీనివాసులుతో సహా ఇంటర్ మినిస్టీరియల్ సెంట్రల్ టీం సభ్యులు డిపార్ట్మెంట్ ఆఫ్ ఎక్స్పెండేచర్ డైరెక్టర్ చిన్మయ పుండ్లిక్ రావు గాట్మేర్(ఐఏఎస్), తాగునీరు, పారిశుధ్య శాఖ డిప్యూటీ అడ్వైజర్(పీహెచ్ఈ) అషిస్‌పాండే, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సెక్రటరీ అరవిందకుమార్ సోనీ బృందం పరిశీలించింది. ఈ ఫొటో ఎగ్జిబిషన్‌లో దెబ్బతిన్న పంట పొలాలు, తాగునీటి ఎద్దడిపై సంబంధిత శాఖల అధికారులు ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను కేంద్ర కరువు బృందం సభ్యులు పరిశీలించారు. అనంతరం రబీలో కరువు పరిస్థితిపై సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్ డా.కె.శ్రీనివాసులు మాట్లాడుతూ 2023-24 రబీలో తీవ్రమైన కరువు పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. జిల్లాలో 58,011 మంది రైతులకు సంబంధించి 59,207 హెక్టార్లకు ఎన్‌డీఆర్ఎఫ్ నిబంధనల ప్రకారం 57.30 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీకి ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. ఇంటర్ మినిస్టీరియల్ సెంట్రల్‌టీం అధికారులు మాట్లాడుతూ నివేదికను కేంద్ర ప్రభుత్వానికి అందజేస్తామని తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి మురళీక్రిష్ణ పాల్గొన్నారు.



కరువు పరిస్థితిపై ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను గురించి వివరిస్తున్న కలెక్టర్ డా.కె. శ్రీనివాసులు

లిఫ్టు ఇరిగేషన్ స్కీములు ఏర్పాటు చేయండి

- కేంద్ర కరువు బృందానికి రైతుల వినతి

ఉయ్యాలవాడ, జూన్ 20: లిఫ్టు ఇరిగేషన్ స్కీములు ఏర్పాటు చేసి ఆదుకోవాలని కేంద్ర కరువు బృందానికి రైతులు విన్నవించారు. గురువారం జిల్లాలోని మూడు మండలాల్లో పర్యటించింది. కోవెలకుంట్ల మండలంలోని భీమునిపాడు, దొర్నిపాడు మండల కేంద్రం, ఉయ్యాలవాడ మండలంలోని హరివరం గ్రామంలో టీం సభ్యులు చిన్మయ్ గాట్మేర్, ఆసిఫ్ పాండే, అరవింద్‌కుమార్ సోనీ పర్యటించి కరువు సమస్యల పరిష్కార మార్గాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ముందుగా పంట నష్టంపై తీసిన ఫొటోలను వారు పరిశీలించారు. అనంతరం రైతులతో ముఖాముఖి నిర్వహించారు. హరివరం గ్రామానికి చెందిన కర్రా ప్రసాద్‌రెడ్డి, పల్లె మహేశ్వరరెడ్డి, కూడాల నారాయణరెడ్డి మాట్లాడుతూ కుందూ నది నుంచి కెసీ కెనాల్‌కు లిఫ్ట్ ఇరిగేషన్ స్కీము ఏర్పాటు చేస్తే వర్షాలు కురవనప్పుడు సాగునీరు మళ్లించుకోవచ్చని అన్నారు. అలాగే పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కేంద్ర బృందాన్ని వారు కోరారు.

- జిల్లాలోని 13 కరువు మండల్లాల్లో 38,791 హెక్టార్లలో పంట నష్టం జరిగినట్లు గుర్తించి కేంద్ర బృందానికి నివేదించామని జిల్లా వ్యవసాయశాఖ అధికారి మురళీక్రిష్ణ తెలిపారు. దీనికి 37,809 మంది రైతులకు రూ. 37.75 కోట్లు అవసరం అవుతుందని కేంద్ర బృందానికి నివేదించారు. జిల్లా వ్యాప్తంగా జొన్న, కొర్ర, ఆముదము పంటల సాగు రైతులకు హెక్టారుకు రూ.8,500, మినుము, శనగ, పొగాకు, పచ్చపెసర, సోయాబీను, సన్‌ఫ్లవర్ సాగు రైతులకు హెక్టారుకు రూ.10 వేలు, మొక్కజొన్న రైతులకు రూ. 12,500, వరి సాగు రైతుకు హెక్టారుకు రూ.15 వేల చొప్పున పరిహారం అందనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి, ఆర్డీవో మల్లికార్జున, డీహెచ్‌వో నాగరాజు, ఏడీఏ సుధాకర్, డ్వామా పీడీ రామచంద్రారెడ్డి, డీఏహెచ్‌వో గోవిందనాయక్, డీడీ రామణయ్య, ఆయా మండలాల ఏవోలు రాజేంద్రకుమార్, సుధాకర్‌రెడ్డి, అబ్దుల్‌హక్, జ్యోతి, సునీత ఆయా శాఖల సిబ్బంది పాల్గొన్నారు.
- **దొర్నిపాడు, జూన్ 20:** మండలంలోని వెలుగు కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో కేంద్ర బృందం సభ్యులు ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలించి రైతులతో మాట్లాడారు. కరువు పరిస్థితులు ఏర్పడటానికి గల కారణాలను, కాలువకు నీటి లభ్యత, శనగ, జొన్న, మినుము తదితర పంటల దిగుబడిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం రైతుల నుంచి వినతులను స్వీకరించారు.



కరువు సమస్యలను కేంద్ర బృందానికి వివరిస్తున్న రైతులు

కుంగిన లైనింగ్

- దెబ్బతిన్న ఎస్సార్బీసీ కాలువలు
- నిధుల లేమితో నిలిచిన మరమ్మతులు



శిథిలమైన 4వ బ్లాకు కెనాల్

పాణ్యం, జూన్ 20: మండలంలోని ఎస్సార్బీసీ మెయిన్ కెనాల్ శిథిలావస్థకు చేరింది. మండలంలోని గోరుకల్లు నుంచి బనగానపల్లె రామతీర్థం వరకు దాదాపు 17 కిలో మీటర్ల వరకు కాలువ నిర్మాణం జరిగింది. 1994లో కెనాల్‌ను నిర్మించగా పర్యవేక్షణ లేకపోవడంతో కాలువ సైడ్ గోడలు పూర్తిగా దెబ్బతిన్నాయి. శ్రీశైలం రిజర్వాయర్ నుంచి ఎస్సార్బీసీకి వదిలే నీటి ప్రవాహానికి మెయిన్ కెనాల్ సైడ్ గోడలు మరింత పడిపోయే పరిస్థితి ఏర్పడింది. గోరుకల్లు తండా, కొనిదేడు ప్రాంతాలతోపాటు ప్రధాన కాలువలకు అనుసంధానంగా ఉన్న పంట కాలువలు శిథిలావస్థకు చేరాయి. దీంతో సాగు నీరు వృథా అవుతోంది. మండలంలోని ఎస్సార్బీసీ కింద ఐదు బ్లాకుల్లోని కాలువల కింద 23,800,76 ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయి. బ్లాకు-1 కింద 5502. 99 ఎకరాలు, బ్లాకు-2 కింద 3814. 81 ఎకరాలు, బ్లాకు-3 కింద 2509.71 ఎకరాలు, బ్లాకు-5 కింద 1,644. 37 ఎకరాలు, బ్లాకు-6 కింద 2028. 76 ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయి. 4వ బ్లాకులోని కొనిదేడు వద్ద కాల్వ సాగు నీటి ప్రవాహానికి భూమి కోతకు గురవుతోంది. దీంతో కాలువలు దెబ్బతిని నీటి వృథాతో సమీపంలోని పంటలు దెబ్బతింటున్నాయి. కాలువకు ఉన్న సైడ్ వాల్ లైనింగ్ తొలగిపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. బ్లాకు -4లో భూపనపాడు సమీపంలో కాల్వలు పూర్తిగా పాడైనట్లు రైతులు చెబుతున్నారు. పలు మార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేదని పేర్కొంటున్నారు. కొన్ని చోట్ల రైతులకు సాగునీరందక పోవడంతో కాలువ గట్టుకు గండ్లు పెట్టడంతో ఈ పరిస్థితి ఏర్పడినట్లు తెలుస్తోంది. కాలువ వెంట ఉన్న రహదారి గట్టును పర్యవేక్షించడంలో ఎస్సార్బీసీ లస్కర్లు నిర్లక్ష్యం వహిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రధానంగా మెయిన్ కెనాల్ పూర్తిగా దెబ్బతినడంతో గోరుకల్లు నుంచి వచ్చే నీటితో కాల్వలు మరింత దెబ్బతినే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. గోరుకల్లు తండా వద్ద స్లూయిజ్ సమీపంలో ప్రధాన కాలువ గట్టు శిథిలావస్థకు చేరుకుంది. గోరుకల్లు రిజర్వాయర్‌కు నీరు చేరకముందే పంట కాల్వలకు మరమ్మతులు చేయాల్సి ఉండగా ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. గత ఏడాది రూ. 8 లక్షలతో ప్రతిపాదనలు పంపించారు. ఈ ఏడాది దాదాపు రూ.12 లక్షలతో మరమ్మతులకు ప్రతిపాదనలు పంపినా రాష్ట్ర జలవనరుల శాఖ వాటిని వెనక్కు పంపినట్లు తెలిసింది



... అనే నేను

- నేటి నుంచి అసెంబ్లీ.. కొలువుదీరనున్న మూడో శాసనసభ
- ఎమ్మెల్యేలతో ప్రమాణం చేయించనున్న ప్రొటెం స్పీకర్
- తొలిసారి అసెంబ్లీలో అడుగు పెట్టబోతున్న ఏడుగురు ఎమ్మెల్యేలు
- అమరావతికి చేరుకున్న బంధువులు, సన్నిహితులు

కర్నూలు, జూన్ 20 (ఆంధ్రజ్యోతి):

నవ్యాంధ్ర ముంగిట టీడీపీ ప్రభుత్వం కొలువుదీరింది. ఈ నెల 12న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, డిప్యూటీ సీఎం కొణిదెల పవన్ కళ్యాణ్, ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన మంత్రులు ఎన్ఎండీ ఫరూక్, టీజీ భరత్, బీసీ జనార్దన్‌రెడ్డి సహా మంత్రులు ప్రమాణ స్వీకారం చేశారు. టీడీపీ ప్రభుత్వం ఏర్పాటైన తరువాత తొలిసారిగా శాసనసభ శుక్రవారం సమావేశం కాబోతోంది. రాష్ట్ర విభజన తరువాత ఆంధ్రప్రదేశ్ మూడో శాసనసభ ఇది. ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల నుంచి 14 మంది ఎమ్మెల్యేలతో ప్రొటెం స్పీకర్ ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. ఇందుకోసం ఎమ్మెల్యేలు, వారి బంధుగణంతో పాటు ముఖ్య సహచరులు అమరావతికి చేరుకున్నారు. అయితే.. శాసనసభలో విజిటర్స్ గ్యాలరీలో స్థలం సమస్య కారణంగా విజిటర్స్‌కు అనుమతి లేదని శాసనసభ అధికారులు వెల్లడించడంతో తమ నాయకుడి ప్రమాణస్వీకార మహోత్సవం కళ్లారా చూడలేకపోతున్నామని ఎమ్మెల్యేలు సన్నిహితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తొలి అడుగు

ఉమ్మడి జిల్లాలో 14 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ఇటీవల జరిగిన ఎన్నికల్లో 12 స్థానాల్లో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అభ్యర్థులు ఎమ్మెల్యేలుగా విజయం సాధించారు. రెండు స్థానాల్లో వైసీపీ ఎమ్మెల్యేలు గెలిచారు. పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు (టీడీపీ), కోడుమూరు (ఎస్సీ) ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి (టీడీపీ), కర్నూలు ఎమ్మెల్యే, మంత్రి టీజీ భరత్ (టీడీపీ), ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి (బీజేపీ), డోన్ ఎమ్మెల్యే, మాజీ కేంద్ర మంత్రి కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి (టీడీపీ), నందికొట్కూరు (ఎస్సీ) ఎమ్మెల్యే గిత్తా జయసూర్య (టీడీపీ), ఆలూరు ఎమ్మెల్యే బి.విరుపాక్షి (వైసీపీ) ఈ ఏడుగురు తొలిసారిగా అసెంబ్లీలో అడుగు పెట్టబోతున్నారు. వీరిలో కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి తొలిసారిగా ఎమ్మెల్యేగా విజయం సాధించి అసెంబ్లీలో అడుగు పెట్టబోతున్నారు. అయితే ఆయన 1991, 2004, 2009 మూడు పర్యాయాలు కర్నూలు ఎంపీగా విజయం సాధించి పార్లమెంట్‌లో ఎంపీగా ప్రమాణ స్వీకారం చేశారు. కేంద్ర రైల్వే సహాయ మంత్రిగా కూడా బాధ్యతలు నిర్వర్తించారు. శాసనసభలో అడుగుపెట్టి ఎమ్మెల్యేలుగా ప్రమాణ స్వీకారం చేయడం ఆనందంగా ఉందని తొలిసారిగా ఎన్నికైన ఎమ్మెల్యేలు పేర్కొన్నారు.

రెండోసారి గెలిచిన ఎమ్మెల్యేలు వీరే

ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీజీ జయనాగేశ్వరరెడ్డి, బనగానపల్లె ఎమ్మెల్యే మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే, మాజీ మంత్రి భూమా అఖిలప్రియ రెండో పర్యాయం ఎమ్మెల్యేగా గెలిచి అసెంబ్లీలో అడుగు పెట్టబోతున్నారు. 2014లో తొలిసారిగా ఎమ్మెల్యేగా గెలిచిన వీరు.. 2019 ఎన్నికల్లో ఓటమి చెందారు. ఐదేళ్ల తరువాత ఇప్పటి ఈ ఎన్నికల్లో మళ్లీ టీడీపీ అభ్యర్థులుగా పోటీ చేసి విజయం సాధించారు. రెండో సారి అసెంబ్లీలో అడుగు పెట్టబోతున్నారు.

ఆ ముగ్గురు సీనియర్ ఎమ్మెల్యేలు

నంద్యాల నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించి సీఎం చంద్రబాబు మంత్రివర్గంలో మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఎన్ఎండీ ఫరూక్ నాలుగోసారి ఎమ్మెల్యేగా అసెంబ్లీలో అడుగుబోతున్నారు. 1985, 1994, 1999, 2024 ఎన్నికల్లో నంద్యాల నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. రాష్ట్ర విభజన తరువాత ఎమ్మెల్సీగా ఎంపికై శాసన మండలి ఛైర్మన్‌గా కూడా పని చేశారు. తాజాగా ఈ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచారు. ఉభయ సభల్లో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీగా బాధ్యతలు నిర్వర్తించిన అందరికి కంటే సీనియర్. అలాగే.. మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి (వైసీపీ) నాలుగో సారి అసెంబ్లీలో అడుగుపెట్టబోతున్నారు. 2009, 2014, 2019, 2024 వరుసగా ఎమ్మెల్యేగా గెలిచారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత మూడోసారి ఎమ్మెల్యేగా గెలిచారు. 2004లో నందికొట్కూరు నుంచి, 2014, 2024లో పాణ్యం నుంచి విజయం సాధించిన ఈమె మూడోసారి అసెంబ్లీలో అడుగుపెట్టబోతున్నారు. ఉమ్మడి జిల్లాలో ఎమ్మెల్యే ప్రమాణస్వీకరం కోసం పెద్ద సంఖ్యలో వారి కుటుంబ సభ్యులు, ముఖ్య అనుచరులు, సన్నిహిత సహచరులు అమరావతికి తరలివెళ్లారు.



సెలవులో నగర పాలక సంస్థ కమిషనర్

అడిషనల్ కమిషనర్‌కు పీవీ రామలింగేశ్వర్ ఇన్‌చార్జి బాధ్యతలు

కర్నూలు(న్యూసిటీ), జూన్ 20: నగర పాలక సంస్థ కమిషనర్ ఎ.భార్గవతేజ ఆరు రోజులు సెలవులో వెళ్లారు. వ్యక్తిగత పనుల నిమిత్తం 20 నుంచి 25 వరకు సెలవులో వెళ్లనున్నట్లు ఉన్నతాధికారుల అనుమతి కోసం లెటరు పంపారు. కమిషనర్ వచ్చే వరకు అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ ఇన్‌చార్జి కమిషనర్‌గా విధులు నిర్వహిస్తారని కమిషనర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 26న కమిషనర్ తిరిగి విధుల్లో చేరనున్నారు. అయితే నగర పాలక సంస్థ కమిషనర్‌గా ఎ.భార్గవతేజ బాధ్యతలు స్వీకరించి రెండు సంవత్సరాల రెండు నెలలు పూర్తయింది. దీంతో బదిలీపై వెళ్లేందుకు సెలవు పెట్టినట్లు కార్యాలయంలో చర్చించుకుంటున్నారు. ప్రధానంగా విజయవాడలోని సీఆర్‌డీఏ కార్యాలయానికి నియమిస్తారని కొందరు అనుకుంటున్నారు. ఈ నేపథ్యంలో గుంటూరు జాయింట్ కలెక్టర్‌గా వెళ్లేందుకు కమిషనర్ ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

అడ్మిషన్ల కోసం ఇంటింటి ప్రచారం



ఇంటింటి ప్రచారం చేస్తున్న ప్రభుత్వ జూనియర్ కాలేజీలోని అధ్యాపకులు

గూడూరు, జూన్ 20: గూడూరు ప్రభుత్వ జూనియర్ కాలేజీ అధ్యాపకులు అడ్మిషన్ల కోసం గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కరపత్రాలు ముద్రించి గూడూరుతోపాటు చుట్టుపక్కల గ్రామాల్లో తిరిగి పదో తరగతి పూర్తయిన విద్యార్థులను కాలేజీలో చేర్పించాలని కోరుతున్నారు. పల్లెల్లో పెద్ద మనుషులను, హైస్కూల్ హెడ్మాస్టర్లను కలిసి తమ కాలేజీలో 2024 పబ్లిక్ ఎగ్జామ్స్‌లో 83 శాతం ఉత్తీర్ణత సాధించారని తెలియజేశారు. చక్కటి విద్యతో పాటు ల్యాబ్ సదుపాయాలు, ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలపై చక్కటి గైడెన్స్, అవసరమైన కోచింగ్ ఇవ్వనున్నట్లు ప్రిన్సిపాల్ అజయ్ కుమార్ తెలిపారు.

హాస్టల్ మార్చడానికి అనుమతి

కర్నూలు(ఎడ్యుకేషన్), జూన్ 20: సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ ఆదేశాల మేరకు గార్గేయపురంలోని ఎస్సీ హాస్టల్‌కు మార్చాలని అనుకున్నామని, ప్రైవేటు భవనం దొరక్కపోవడంతో అదే పాత భవనంలోనే హాస్టల్ నిర్వహణ చేయాలని చెప్పడంతో తప్పనిసరిగా కొనసాగించాల్సి వచ్చిందని హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ బి. చిన్నమదారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19వ తేదీన ఆంధ్రజ్యోతి దినపత్రికలో శిథిల భవనాలు అనే శీర్షికతో కథనం అచ్చయింది. ఈ నేపథ్యంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని శిథిలావస్థలో ఉన్న గదులకు తాళం వేశామన్నారు. హాస్టల్‌కు కేవలం ఐదుగురు విద్యార్థులు మాత్రమే వచ్చారన్నారు. హాస్టళ్లను ప్రారంభించలేదన్న దాంట్లో వాస్తవం లేదన్నారు. విద్యార్థుల సౌకర్యార్థం గ్రామ సర్పంచ్, ఎంపీటీసీ సభ్యుల పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సహకారంతో పక్కనే ఉన్న పాఠశాలలోని నాలుగు గదులు హాస్టల్‌కు ఇవ్వాలని జడ్పీ సీఈవోను, జిల్లా విద్యాశాఖ ను కోరామన్నారు. దానికి వారు సానుకూలంగా స్పందించారని తెలిపారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

కొత్తపల్లి, జూన్ 20: అప్పుల బాధ తాళలేక గురువారం ఓ రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల మేరకు.. నంద్యాల జిల్లా కొత్తపల్లి మండలం సింగరాజుపల్లి గ్రామానికి చెందిన కుమ్మరి వెంకట రమణ (44) తనకున్న రెండెకరాల పొలంతోపాటు మరో నాలుగు ఎకరాలను కౌలుకు తీసుకుని మొక్కజొన్న, పత్తి పంటలు సాగు చేశాడు. రెండేళ్లుగా పంటలు సరిగా పండక తీవ్రంగా నష్టపోయాడు. రూ.10 లక్షల మేర అప్పులు కావడంతో తీర్చలేక గురువారం కొత్తపల్లి, లింగాపురం గ్రామాల మధ్యలోని ఓ పంట పొలంలో పురుగుల మందు తాగాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకుని కొత్తపల్లి పీహెచ్‌సీకి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. వెంటకరమణకు భార్య లక్ష్మీదేవి, ముగ్గురు కూతుళ్లు, కుమారులు ఉన్నారు. లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ బాబా ఫక్రుద్దీన్ తెలిపారు.

చెక్‌బౌన్స్ కేసులో నిందితుడికి జైలు జరిమానా

కర్నూలు(లీగల్), జూన్ 20: ఇంటి అవసరాల కోసం అప్పు తీసుకుని ఆ తర్వాత చెల్లని చెక్కు ఇచ్చిన నిందితుడికి ఏడాది కారాగార శిక్ష, రూ.2 లక్షల జరిమానా విధిస్తూ కర్నూలు మొదటి అదనపు జ్యూడీషియల్ మేజిస్ట్రేట్ టి. జ్యోత్స్న దేవి గురువారం తీర్పు చెప్పారు. స్థానిక బుధవారపేటకు చెందిన కే. శివశంకర్ నుంచి నిర్మల్ కుమార్ రెండు విడతలుగా రూ.2.50 లక్షలను అప్పుగా తీసుకున్నాడు. 2018 మార్చి నెలలో నిర్మల్ కుమార్ రూ.2 లక్షలకు తన బ్యాంకు చెక్కును శివశంకర్‌కు ఇచ్చాడు. ఆ చెక్కును వసూలు కోసం పంపగా.. నిందితుని ఖాతాలో తగిన నిల్వలు లేకపోవడంతో చెక్కు బౌన్స్ అయింది. దీంతో శివశంకర్ నిందితునిపై కేసు దాఖలు చేశారు. కోర్టులో నేరం రుజువు కావడంతో ఏడాది కఠిన కారాగార శిక్ష, బాకీ మొత్తంతోపాటు జరిమానాగా మరో రూ.2 లక్షలు చెల్లించాలని మేజిస్ట్రేట్ తీర్పు ఇచ్చారు.

బీజేపీ నాయకుల మధ్య వాగ్వాదం



గొడవ పడుతున్న బీజేపీ నాయకులు

రాష్ట్ర ప్రధాన కార్యదర్శిని అడ్డుకున్న స్థానిక నాయకులు

కర్నూలు(ఎడ్యుకేషన్), జూన్ 20: భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిట్ర శివనారాయణకు, కర్నూలు జిల్లా బీజేపీ నాయకులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. రెండు వర్గాల మధ్య మాటా మాటా పెరిగి చేయి చేసుకునే వరకు వెళ్లింది. గురువారం స్థానిక దేవి ఫంక్షన్ హాలులో కర్నూలు పార్లమెంటు నియోజకవర్గ ఎన్నికల సమీక్ష సమావేశం జరిగింది. బీజేపీ సీనియర్ నాయకులు కాళింగి నరసింహవర్మ అకాలమృతి పట్ల బీజేపీ నాయకులు ప్రగాఢ సంతాపాన్ని తెలపలేదని కర్నూలు సీనియర్ నాయకులు సమావేశాన్ని బహిష్కరించి హాలు నుంచి బయటకు వచ్చారు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివనారాయణ కారు ఎక్కుతుండగా.. బీజేపీ సీనియర్ నాయకులు కె. కపిలేశ్వరమయ్య, మాజీ కార్పొరేటర్ రంగస్వామి, మాజీ జిల్లా అధ్యక్షుడు రామస్వామితో పాటు మరికొంత మంది అడ్డుకుని దూషించుకున్నారు. బీజేపీ నాయకులు రెండు వర్గాలుగా విడిపోయి వాగ్వివాదానికి దిగారు.

- **ఆదోని ఆర్థిక వ్యవహారమే గొడవకు కారణం:** ఆదోని ఎమ్మెల్యే సీటును వదులుకుంటే రూ.3 కోట్లు ఇస్తామని మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు బంధువుకు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలకంఠ అన్న నాగరాజుకు మధ్య చర్చ జరిగిందని అప్పట్లో దుమారం లేచిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారానికి కారణమైన నీలకంఠను జిల్లా అధ్యక్ష పదవి నుంచి తొలగించాలని సీనియర్ నాయకులు కపిలేశ్వరమయ్య, మరికొంత మంది రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివనారాయణను కోరారు. ఇది బయటి వ్యక్తుల వ్యవహారమని, ఇందులో నీలకంఠ పాత్ర ఏమీ లేదని శివనారాయణను రాష్ట్ర అధ్యక్షుడు వెనుకవేసుకుని వచ్చారు. సమస్య ఉంటే రాష్ట్ర కమిటీ దృష్టికి తీసుకెళ్తానని సమాధానం ఇచ్చారు. దీంతో ఆయన అడ్డగించి దాడి చేసేంత వరకు వెళ్లింది.

రాష్ట్ర దేవదాయశాఖ మంత్రికి సన్మానం



రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి మెమెంటో ఇస్తున్న ఈవో చంద్రశేఖర్‌రెడ్డి

మహానంది, జూన్ 20: రాష్ట్ర దేవదాయశాఖ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన ఆనం రామనారాయణరెడ్డిని గురువారం మహానంది ఆలయ వేదపండితులు విజయవాడలో ఆశీర్వదించారు. ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక వాహనంలో ఆలయ వేదపండితులు, అర్చకులు విజయవాడలోని గొల్లపూడి దేవదాయ, ధర్మాదాయశాఖ కార్యాలయంలోని మంత్రి చాంబర్‌లో రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనంను మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం శాలువాతో సన్మానించి ఆశీర్వదించారు. ఈవో మంత్రికి మెమెంటోను అందజేశారు. మహానంది ఆలయ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించారు.

కానిస్టేబుల్‌పై అత్యాచార యత్నం కేసు నమోదు

పగిడ్యాల, జూన్ 20: నంద్యాల జిల్లాలో ఓ కానిస్టేబుల్‌పై గురువారం అత్యాచార యత్నం కేసు నమోదైంది. పోలీసుల వివరాల మేరకు.. పగిడ్యాల మండల పరిధిలోని ముచ్చుమర్రి పోలీస్‌స్టేషన్‌లో ఈశ్వర్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ఎలాంటి గొడవలు జరగకుండా ఉండేందుకు ఈ నెల 1వ తేదీన నెహ్రూనగర్ గ్రామంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఇందులోభాగంగా గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో రాత్రి బస చేశారు. అయితే దోమల బెడద అధికంగా ఉందని అదే గ్రామానికి చెందిన తన బంధువు అయిన కుమార్‌కు ఫోన్ చేశాడు. దీంతో కుమార్ కానిస్టేబుల్‌ను ఇంటికి తీసుకెళ్లాడు. ఇద్దరూ కలిసి మిద్దెపై పడుకున్నారు. అయితే నిద్రపోతున్నట్లు నటించిన కానిస్టేబుల్ కొద్దిసేపటి తరువాత ఇంటిలోకి ప్రవేశించి కుమార్ భార్యపై అత్యాచార యత్నం చేశాడు. బాధితురాలు పుష్పావతి గురువారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని విచారిస్తున్నట్లు ఎస్ఐ జయశేఖర్ తెలిపారు.

16 మంది వైద్యులకు అసోసియేట్ ప్రొఫెసర్లుగా పదోన్నతి

కర్నూలు(హాస్పిటల్), జూన్ 20: కర్నూలు మెడికల్ కాలేజీలో 16 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లకు అసోసియేట్ ప్రొఫెసర్లుగా పదోన్నతులు లభించాయి. ఈ మేరకు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) గురువారం పదోన్నతుల కౌన్సిలింగ్ నిర్వహించారు. అనస్థీషియాకు చెందిన స్వాతి, ఎం. శారద, చంద్రశేఖర్, జనరల్ మెడిసిన్‌కు చెందిన నిలోఫర్‌సిమా, ఆర్థోకు చెందిన ప్రవీణ్ కుమార్‌బాబు, అర్చనబాబు, పి. కవిత (రేడియాలజీ), పీఆర్ వనజ (బయోకెమిస్ట్రీ), సి.గాయత్రి (బయోకెమిస్ట్రీ), హసీనా (ఫిజియాలజీ), సౌజన్య (న్యూరాలజీ), శ్యాంబాబు (న్యూరాలజీ), సుధాకర్ (ఓంబీసజీ) విజయ్‌బాబు (జనరల్ సర్జరీ), మాధవకృష్ణ (జనరల్ సర్జరీ), పార్వతి, (జనరల్ సర్జరీ) పదోన్నతులు పొందిన వారిలో ఉన్నారు.

సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్య

నందికొట్కూరు రూరల్, జూన్ 21: నందికొట్కూరు మండలంలోని శాతనకోట గ్రామానికి చెందిన వడ్ల చంద్రమౌళి(45)అనే వ్యక్తి సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్య చేసుకున్నాడు. బ్రాహ్మణకొట్కూరు పోలీసుల వివరాల మేరకు శాతనకోట గ్రామానికి చెందిన వడ్ల చంద్రమౌళి 20 సంవత్సరాల క్రితం చెరుకుచెర్ల గ్రామానికి చెందిన లలితను పెళ్లి చేసుకున్నాడు. భార్యాభర్తలిద్దరూ హైదరాబాద్‌లోని శ్రీరామ చిట్ ఫండ్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. వీరికి సాయిప్రణవ్, సాయి ప్రణీప్ సంతానం. అయితే లలిత తన పై అధికారి వెంకటరెడ్డితో వివాహేతర సంబంధం ఏర్పరచుకుందన్న అనుమానంతో తరచూ ఆమెతో గొడవ పడుతుండేవాడు. చంద్రమౌళికి ఉన్న ఆస్తులను భార్య తెలివిగా రాయించుకుని విడాకులు తీసుకుంది. ఆ తర్వాత ఉన్న ఉద్యోగాన్ని కూడా బదిలీ చేయించడంతోపాటు ఉద్యోగంలో డిమోషన్ చేయించింది. ఇదంతా భరించలేక శాతనకోట గ్రామానికి వచ్చి జరిగినదంతా తండ్రి నారాయణకు తెలియజేశాడు. ఈ క్రమంలోనే బుధవారం రాత్రి తండ్రితో బయటికి వెళ్లి వస్తానని చెప్పి తిరిగి రాలేదు. రాత్రి కావడంతో గ్రామస్థులు గాలించారు. ఊరి బయట వెతకగా చెట్టుకు ఉరివేసుకుని కనిపించాడు. తండ్రి వడ్ల నారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

సీఐ మారుతి శంకర్‌కు జైలు శిక్ష

నందికొట్కూరు, జూన్ 20: ఓ వ్యక్తి వేసిన ప్రైవేట్ కేసులో సీఐ మారుతి శంకర్‌కు సంవత్సరం జైలు శిక్ష, రూ.10 వేలు జరిమానా విధిస్తూ నందికొట్కూరు ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ దివ్య తీర్పునిచ్చారు. 2013లో ముచ్చుమర్రి ఎస్ఐగా మారుతి శంకర్ విధులు నిర్వహిస్తున్న సమయంలో పగిడ్యాల మండలం ఘణపురం గ్రామానికి చెందిన నాగిరెడ్డి తన కుమారుడైన నరేంద్రారెడ్డికి తలెత్తిన వివాదంలో పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. స్టేషన్‌కు తీసుకెళ్లేందుకు వచ్చిన పోలీసులతో వారెంట్ ఉందా అని నరేంద్రారెడ్డి ప్రశ్నించాడు. దీంతో ఎస్ఐ మారుతి శంకర్ బాధితునిపై దాడి చేశారని ప్రైవేటు కేసు వేశారు. దీంతో నందికొట్కూరు కోర్టు సంవత్సరం జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చింది. అయితే బెయిల్‌పై విడుదలైనట్లు తెలిసింది. మారుతి శంకర్ ప్రస్తుతం చిత్తూరు జిల్లాలోని గంగాధర నెల్లూరు పోలీస్టేషన్‌లో సీఐగా విధులు నిర్వహిస్తున్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి



ప్రసంగిస్తున్న న్యాయాధికారి బి.లీలా వెంకట శేషాద్రి

కర్నూలు(లీగల్), జూన్ 20: పర్యావరణాన్ని ప్రతి ఒక్కరూ పరిరక్షించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయాధికారి బి. లీలా వెంకట శేషాద్రి తెలిపారు. గురువారం ఘన వ్యర్థాల నిర్వహణ అంశంపై స్థానిక న్యాయ సేవాసదన్ భవనంలో ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని ఘన వ్యర్థాలు కూడా కాలుష్యం చేసే ప్రమాదం ఉందని, కాబట్టి వాటిని వీలైనంత వరకు నివాస స్థలాలకు దూరంగా ఉంచాలని అన్నారు. ఘన వ్యర్థాలైన మెడికల్, బయోమెడికల్, బాటరీ వ్యర్థాలు, ఈ-వ్యర్థాలు, రేడియో యాక్టివ్ వ్యర్థాలు లాంటి వాటిని ఘన వ్యర్థాల పట్ల తగు జాగ్రత్త వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీపీవో నాగరాజునాయుడు, డీఎల్‌పీవో ఎస్. నూర్జహాన్, డీఆర్పీ వి.జేమ్స్ కృపావరం, కాలుష్య నియంత్రణ మండలి సైంటిఫిక్ ఆఫీసర్ గణేష్ కుమార్, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తెలుగుదేశంలోకి ముగ్గురు కౌన్సిలర్లు

- నేడు మరో నలుగురు చేరే అవకాశం
- మున్సిపాలిటీ పీఠం టీడీపీ కైవసం?



భార్గవ్‌రామ్‌నాయుడు సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ కౌన్సిలర్లు

ఆళ్లగడ్డ, జూన్ 20: ఆళ్లగడ్డ మున్సిపాల్టిలోని వైసీపీకి చెందిన 26 వార్డు కౌన్సిలర్ మహబూబ్ బాషా, 13వ వార్డు కౌన్సిలర్ మునగాల సంజీవ, 8వ వార్డు కౌన్సిలర్ సోముల మధు సూదన్‌రెడ్డి టీడీపీ నాయకుడు భార్గవ్‌రామ్‌నాయుడు సమక్షంలో గురువారం టీడీపీ చేరారు. వీరితో పాటు వైసీపీ నాయకులు తలారి శీను, నగరం రాజు, చేరారు. దీంతో టీడీపీ ఖాతాలో ఏడుగురు కౌన్సిలర్లు ఉన్నారు. మరో నలుగురు శుక్రవారం చేరేందుకు వైసీపీ కౌన్సిలర్లు సిద్ధంగా ఉన్నారు. వీరితో టీడీపీ కౌన్సిలర్ల సంఖ్య 11కు చేరుకోనుంది. మున్సిపాలిటీలో 27 మంది కౌన్సిలర్లు ఉన్నారు. శుక్రవారం నలుగురు కౌన్సిలర్లు టీడీపీలో చేరితే మరో ముగ్గురు కౌన్సిలర్లు మాత్రమే అవసరం ఉంటుంది. ఇదిలా ఉండగా కౌన్సిల్‌లో ఎమ్మెల్యేకు, ఎంపీకి సభ్యత్వం ఉంటుంది. దీంతో టీడీపీ కౌన్సిలర్ల సంఖ్య 13కు చేరుతుంది. ఛైర్మన్ పదవి కోసం ఒక్క కౌన్సిలర్ అవసరం. ఆ కౌన్సిలర్ కూడా టీడీపీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. దీంతో ఆళ్లగడ్డ మున్సిపాలిటీలో 2017 నాటి పరిస్థితులు పునరావృతం కానున్నట్లు తెలుస్తోంది. ఆ సమయంలో దివంగత భూమా నాగిరెడ్డి వైసీపీ నుంచి టీడీపీలో చేరటంతో వైసీపీ కౌన్సిలర్లు టీడీపీలో చేరటంతో ఛైర్మన్ పదవి టీడీపీ కైవసం చేసుకుంది.

'లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లు అందిస్తాం'



టిడ్కో గృహాలను పరిశీలిస్తున్న ఫిరోజ్

నంద్యాల (నూనెపల్లె), జూన్ 20: టీడీపీ ప్రభుత్వంలో నిర్మించిన టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అందజేయడంలో గత వైసీపీ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని, పెండింగ్ పనులు పూర్తి చేసి లబ్ధిదారులకు అందిస్తామని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ అన్నారు. నంద్యాల పట్టణ శివారులోని టిడ్కో గృహాల సముదాయాన్ని గురువారం ఫిరోజ్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ 80 శాతం నిర్మాణాలను పూర్తి చేస్తే మౌలిక వసతులను కల్పించకుండా వైసీపీ ప్రభుత్వం చేతులెత్తేయడం దారుణమన్నారు. నందమూరి నగర్‌కు వెళ్లే రహదారిలో కుందూ నదిపై నూతన వంతెన నిర్మాణాన్ని పరిశీలించారు. గత టీడీపీ హయాంలో వంతెన నిర్మాణ పనులను ప్రారంభిస్తే దాన్ని వైసీపీ ప్రభుత్వం పూర్తి చేయలేదని ధ్వజమెత్తారు. నంద్యాల అభివృద్ధికి ప్రణాళికలను రూపొందిస్తామని అన్నారు. ఆయన వెంట టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బాకా శివశంకర్ యాదవ్, కౌన్సిలర్లు మాజీ కౌన్సిలర్లు, నాయకులు ఉన్నారు.

డీజీపీ నియామకంపై బీసీల హర్షం

నంద్యాల (నూనెపల్లె), జూన్ 20: ఏపీ డీజీపీగా ద్వారకా తిరుమలరావును నియమించడంపై టీడీపీ బీసీ సాధికార రాష్ట్ర అధికార ప్రతినిధి గోవిందనాయుడు, బీసీ సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. బీసీ సామాజిక వర్గానికి రాష్ట్ర అత్యున్నత పోస్టు అయిన డీజీపీగా నియమించి బీసీల మీద ఉన్న ప్రేమను చంద్రబాబు నాయుడు చాటారని కొనియాడారు.

'అవకతవకలపై విచారణ జరిపించాలి'

పాణ్యం, జూన్ 20: ఎన్‌టీఏ నిర్వహించిన నీట్, నెట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలపై న్యాయవిచారణ జరిపించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ప్రతాప్ డిమాండ్ చేశారు. బాధిత విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం పాణ్యంలోని డిగ్రీ కళాశాల ఎదుట నిరసన చేపట్టారు. కార్యక్రమంలో గణేష్, విగ్నేష్, రాజు, నగేష్, కార్తీక్, వేణు, ఉపేంద్ర పాల్గొన్నారు.

'నీరే ప్రాణాధారం'

బండిఆత్మకూరు, జూన్ 20: సకలచరాచర జీవకోటికి నీరే ప్రాణాధారమని ఎంఈవోలు యశోద, మోహన్‌రెడ్డి సూచించారు. గురువారం మండలంలోని శింగవరం హైస్కూల్‌లో సేవ్ వాటర్ కార్యక్రమం నంద్యా ఎన్‌జీసీ కోఆర్డినేటర్ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రతి నీటి బొట్టును భావి తరాల కోసం నేటి విద్యార్థులు ఒడిసి పట్టాలని సూచించారు. నీటి పొదుపు ఎంతో అవసరమని అన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం దస్తగిరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

25 నుంచి గొర్రెల సంత

పాణ్యం, జూన్ 20: పాణ్యం వ్యవసాయ మార్కెట్ యార్డులో ఈనెల 25 వతేదీ నుంచి రైతులు, వ్యాపారుల సౌకర్యార్థం మేకలు, గొర్రెల సంతను నిర్వహిస్తున్న జిల్లా ఏడీఎం అబ్దుల్ రెహమాన్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ప్రతి మంగళవారం సంతను నిర్వహించనున్నట్లు తెలిపారు. పాణ్యం పరిధిలోని రైతు సోదరులు, వ్యాపారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

'పార్టీ బలోపేతానికి కృషి చేయాలి'



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివనారాయణ

నంద్యాల (కల్చరల్), జూన్ 20: బీజేపీ బలోపేతానికి పార్టీ కన్వీనర్లు, కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివనారాయణ కోరారు. గురువారం నంద్యాలలో జిల్లా పార్లమెంట్ ఎన్నికల కార్యాలయంలో జిల్లా కోర్ కమిటీ సమావేశం నంద్యాల జిల్లా కోఆర్డినేటర్ అభిరుచి మధు నిర్వహణలో నిర్వహించారు. పార్టీ కన్వీనర్లు, కార్యకర్తలు అందరూ సమావేశమై పార్టీ భవిష్యత్తు గురించి చర్చించారు. కార్యక్రమంలో నంద్యాల ఇన్‌చార్జి రమేశ్ నాయుడు, డా.ఆదినారాయణ, కశెట్టి కృష్ణమూర్తి, కార్యకర్తలు పాల్గొన్నారు.

దత్తాత్రేయ స్వామికి విశేష పూజలు

శ్రీశైలం, జూన్ 20: శ్రీశైలం మహాక్షేత్రంలో గురువారం మల్లికార్జునస్వామి ఆలయ ప్రాంగణంలోని త్రిఫలవృక్షం క్రింద ఉన్న దత్తాత్రేయ స్వామివారికి లోకకల్యాణం కోసం విశేష పూజలను దేవస్థానం నిర్వహించింది. పూజా కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతి పూజలు చేసి, అనంతరం దత్తాత్రేయస్వామికి పంచామృతాభిషేకం, విశేష పూజలు జరిపారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు



నృత్యం చేస్తున్న కళాకారులు

శ్రీశైలం, జూన్ 20: శ్రీశైల దేవస్థానం ధర్మపథంలో భాగంగా నిర్వహిస్తున్న నిత్యకళారాధన కార్యక్రమంలో గురువారం హైదరాబాద్‌కు చెందిన శ్రీధర కూచిపూడి ఆర్ట్స్ అకాడమీ బృందంతో సంప్రదాయ నృత్య ప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్య కళారాధన వేదిక వద్ద నిర్వహించిన కార్యక్రమంలో గణేశపంచరత్నం, ఆనందతాండవం, కాలభైరవాష్టకం, శివతాండవం, మూషికవాహన తదితర గీతాలకు కళాకారులు నృత్య ప్రదర్శనతో అలరించారు.

సిద్ధాపురం ఎత్తిపోతల అభివృద్ధికి కృషి

• శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి



పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి

ఆత్మకూరు, జూన్ 20: ఐదేళ్ల వైసీపీ పాలనలో సిద్ధాపురం ఎత్తిపోతల పథకాన్ని నాశనం చేశారని, ప్రస్తుతం ప్రాజెక్ట్ అభివృద్ధికి కృషి చేస్తామని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. బుడ్డా వెంగళరెడ్డి సిద్ధాపురం ఎత్తిపోతల పథకాన్ని ఇరిగేషన్ అధికారులతో సందర్శించారు. ముందుగా మట్టిని, కుడిప్రధాన కాలువ తూమును పరిశీలించారు. అనంతరం అధికారులతో మాట్లాడి ప్రస్తుత ప్రాజెక్ట్ స్థితిగతుల గురించి ఆరా తీశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో టీడీపీ హయాంలో రెండేళ్ల వ్యవధిలోనే సిద్ధాపురం ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసి ప్రారంభించామని అన్నారు. అలాగే పంట కాలువల పనులను చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని తెలిపారు. రైతు ప్రభుత్వమని గొప్పలు చెప్పుకున్న వైసీపీ నాయకులు సిద్ధాపురం ఎత్తిపోతల పథకం ద్వారా ఒక్క కన్నీరు కూడా తుడవలేకపోయారని విమర్శించారు. రెండు, మూడు నెలల పాటు ఆయా పనులపై సర్వే చేపట్టి పకడ్బందీ అంచనాలను తయారు చేయిస్తామని చెప్పారు. ఐదు గ్రామాల ఆయకట్టుకు కూడా నీరందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. అండర్‌గ్రౌండ్ కరెంట్ లైన్ ఎలివేషన్ కరెంట్ లైన్‌గా మార్చేలా చొరవ తీసుకోవడంతోపాటు మట్టికట్టపై ఎలాంటి జంగిల్ లేకుండా ఎప్పటికప్పుడు మెరుగైన నిర్వహణ ఉండేలా కృషి చేస్తానని చెప్పారు. ఆయన వెంట తెలుగుగంగ పథకం ఈఈ వెంకటేశ్వర్లు చెట్టి, డీఈలు రమేష్‌బాబూజీ, ఆరీఫుల్లా, వెంకటేశ్వర్లు, ఏఈలు శరబారెడ్డి, శివనాయక్, టీడీపీ మండల, పట్టణాధ్యక్షులు శివప్రసాద్‌రెడ్డి, వేణుగోపాల్, బాషా, రాజారెడ్డి, స్వామిరెడ్డి, గంగాధర్‌రెడ్డి, దినకర్ తదితరులు ఉన్నారు.

● ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డిని గురువారం నంద్యాల జిల్లా ఏపీ పీఈటీ అండ్ ఎస్ఏ అసోషియేషన్ కార్యవర్గ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. సిద్ధాపురం ఎత్తిపోతల సందర్శనకు వచ్చిన ఎమ్మెల్యే బుడ్డాను అక్కడే కలిసి శాలువా, పూలమాలతో సత్కరించారు. అధ్యక్షుడు ప్రభాకర్, కార్యదర్శి రవికుమార్, ట్రెజర్ సోమన్న, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు దేవానంద్, శంకర్, మురళీనాయక్, సుదర్శన్‌రావు తదితరులు ఉన్నారు.

బండిఆత్మకూరు: అధికారులు ముఖ్యంగా గ్రామాల్లో సమస్యలపై దృష్టి పెట్టాలని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి సూచించారు. మండల పరిషత్ కార్యాలయ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, పొదుపు సిబ్బంది, ఉపాధి సిబ్బంది గురువారం ఎమ్మెల్యేను వేల్పనూరులోని ఆయన స్వగృహం వద్ద వేర్వేరుగా కలిసి శుభాకాంక్షలు చెప్పారు. ఎంపీడీవో విజయరావు, ఈవోపీఆర్డీ శ్రీనివాసులు, ఏవో హనీఫ్‌ఖాన్, ఏపీఎం రాజశేఖర్‌రెడ్డి, సీసీలు సుకూర్, సుబ్బయ్య ఫీల్డు అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వెలుగోడు: వేల్పనూరులో ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డిని ఆయన ఇంటి వద్ద కలిసేందుకు భారీగా తరలి వచ్చారు. వెలుగోడు పట్టణంలోని సీపీ నగర్‌కు చెందిన ముర్తుజావలి, శాంతారామ్, రవి కిసోర్ రెడ్డి అనే యువకులు బుడ్డాను కలిశారు.



ఎమ్మెల్యేను కలిసిన బండిఆత్మకూరు మండల పంచాయతీ కార్యదర్శులు

జనారణ్యంలోకి చుక్కల దుప్పి

గడివేముల, జూన్ 20: నల్లమల అరణ్యం నుంచి మండలంలోని పెసరవాయి గ్రామంలోకి గురువారం చుక్కల దుప్పి తప్పిపోయి వచ్చింది. కుక్కలు దుప్పిని వెంట పడుతుండటంతో తప్పించుకొని కల్లంలోకి వెళ్లింది. స్థానికులు గమనించి కుక్కల బెడద నుంచి తప్పించారు. దుప్పి పారిపోకుండా గేట్లు మూసి వేసి ఫారెస్టు రేంజి ఆఫీసర్ నసిర్‌జాకు సమాచారం ఇచ్చారు. దీంతో ఆయన చుక్కల దుప్పి ఉన్న ప్రదేశానికి రిస్క్ సిబ్బంది, ప్రొటెక్షన్ టీమ్‌ను పంపించారు. సెక్షన్ ఆఫీసర్ వెంకటసుబ్బయ్య, బీట్ అధికారులు హైమావతి, రమణ సిబ్బందితో కలిసి చుక్కల దుప్పిని బంధించారు. అనంతరం వారు మాట్లాడుతూ గాయపడిన చుక్కల దుప్పిని చికిత్స నిర్వహించి నల్లమల అడవిలో వదిలిపెడతామని వారు తెలిపారు.

'చెత్త సంపద కేంద్రాలను అభివృద్ధి చేయండి'



తమ్మరాజుపల్లెలో చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీవో

పాణ్యం, జూన్ 20: చెత్త సంపద కేంద్రాలను అభివృద్ధి పరచాలని జిల్లా పంచాయతీ అధికారి మంజులవాణి ఆదేశించారు. గురువారం తమ్మరాజుపల్లెలోని చెత్త సంపద కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. డీపీవో మాట్లాడుతూ చెత్త సంపద కేంద్రాల ద్వారా వచ్చే ఆదాయాన్ని గ్రామాభివృద్ధికి వినియోగించాలన్నారు. వర్మీ కంపోస్టు తయారీ త్వరలో ప్రారంభించాలన్నారు. పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, శేషు, సిబ్బంది పాల్గొన్నారు.

'విజయవంతం చేయాలి'

కొత్తపల్లి, జూన్ 20: వరంగల్‌లో జూలై 7న జరిగే కవాతును విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు కేవీ రమణ, తాలుకా ఇన్‌చార్జిలు ప్రేమ్‌రాజ్, ప్రసాద్ పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ స్థాపించి 30 ఏళ్లు పూర్తయిన సందర్భంగా కొత్తపల్లిలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి గురువారం ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ మండల అధ్యక్షుడు మద్దిలేటి, నాగన్న ఆధ్వర్యంలో కవాతు నిర్వహించారు. నాయకులు నాగరాజు, రాజు, రామకృష్ణ, వెంకటేశ్వర్లు, దాన్ శ్రీను, సురేష్, మల్లయ్య, హరి, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

'అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలి'

శ్రీశైలం, జూన్ 20: శ్రీశైలం దేవస్థానంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి శోమిశెట్టి మల్లికార్జున కోరారు. క్షేత్ర పరిధిలో అనేక వ్యాపార కేంద్రాలు, హోటళ్లు, సత్రాలు, నివాసాలు ఉన్నాయని ఏదైన అగ్నిప్రమాదం సంభవిస్తే నివారణకై అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేయాల్సిన అత్యవసరం ఉందని ఆయన అన్నారు.

మహానందిలో ఐఏఎస్ అధికారుల బృందం



మహానందిలో ఐఏఎస్ అధికారుల బృందం

మహానంది, జూన్ 20: మహానంది క్షేత్రంలో గురువారం రాత్రి ఐఏఎస్ అధికారులు నంద్యాల జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి, న్యూ ఢిల్లీ ఆదాయ వ్యయం శాఖకు చెందిన చిన్మయ్ గోత్‌మేరీ(ఐఏఎస్) ఆశీష్‌పాండే (డిప్యూటీ అడ్వయిజర్(పీహెచ్ఈ, న్యూఢిల్లీ)తో పాటు రూరల్ డెవలప్‌మెంట్ సెక్రటరీ, న్యూ ఢిల్లీప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరికి ఆలయం ముఖద్వారం వద్ద టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నీలకంఠరాజు ఆధ్వర్యంలో అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ప్రధాన ఆలయాల్లో స్వామి,అమ్మవార్లకు భక్తి శ్రద్ధలతో అభిషేకార్చనలు జరిపారు. అనంతరం ఐఏఎస్ బృందం ను వేదపండితులు ఆశీర్వదించారు. ఏఈవో ఎర్రమల్ల మధు వీరిని శాలువాతో సన్మానించారు. వీరి వెంట మండల తహసీల్దార్ రామచంద్రుడు, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులు ఉన్నారు.

కోడిగుడ్డుపై యోగాసనాలు



నంద్యాల (కల్చరల్), జూన్ 20: నంద్యాలకు చెందిన ప్రముఖ చిత్రకారుడు చింతలపల్లె కోటేష్ ప్రపంచ యోగా దినోత్సవం పురష్కరించుకొని వినూత్నంగా కోడిగుడ్డుపై యోగాసనాలు చిత్రీకరించాడు. మైక్రోబ్రస్‌తో యోగాసనాలు చిత్రాలు చిత్రించి అందరిచే శభాష్ అనిపించుకుంటున్నాడు చిత్రకారుడు కోటేష్. యోగా వలన ఎన్నో ప్రయోజనాలు వున్నాయన్నారు.

శ్రీశైలంలో మద్యం స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

శ్రీశైలం, జూన్ 20: శ్రీశైలంలో మద్యం విక్రయిస్తున్న బుజ్జిబాయి నుంచి 180 ఎంఎల్ 42 మద్యం బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీఐ ప్రసాదరావు మాట్లాడుతూ దేవస్థానం పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు పాటుపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే శ్రీశైలం దేవస్థానం పరిధిలో నాటుసారా, గంజాయి విక్రయిస్తూ పరారీలో ఉన్న నిందుతులను గురువారం శ్రీశైలం వన్ టౌన్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నాటుసారా కేసులో పెచ్చెరువుకు చెందిన ఆర్తి గోవిందు, గంజాయి కేసులో ప్రకాశం జిల్లా, దోర్నాలకు చెందిన నల్లభోతుల తిరుపతయ్య ఉన్నారు.

'పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి'

మహానంది, జూన్ 20: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మండల విద్యాశాఖాధికారి రామసుబ్బయ్య పిలుపునిచ్చారు. మండలంలోని ఎం. తిమ్మాపురంలోని జడ్పీ పాఠశాల ఆవరణలో ఎన్‌జీసీ సమన్వయకర్త సి.చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో పర్యవరణ పరి రక్షణలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఉపాధ్యాయిలు, విద్యార్థులు చేపట్టారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈవో మాట్లాడుతూ నాటిన ప్రతి మొక్కను విద్యార్థులకు దత్తత ఇచ్చి వాటిని సంరక్షించేలా చూడాలని సూచించారు. అలాగే నీటిని పొదుపు చేయడంపై ఉపాధ్యాయిలు విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ఎన్‌జీసీ కోఆర్డినేటర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పర్యావరణ పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పర్యావరణంపై అవగాహన కల్పించి, మొక్కలు నాటే కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నట్లు చెప్పారు. హెచ్ఎం నారాయణ, సైన్స్ కో ఆర్డినేటర్ సుబ్బారెడ్డి, ఉపాధ్యాయిలు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవం

ఆత్మకూరు, జూన్ 20: ఆత్మకూరు పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయ 26వ వార్షికోత్సవ వేడుకలు గురువారం వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా స్వామివారికి ఆలయ అర్చకులు పవన్‌కుమార్‌శర్మ పర్యవేక్షణలో విశేష అలంకరణ గావించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా ఈ వేడుకలో భాగంగా ఉదయం 6గంటల నుంచే ఆలయంలో మహాగణపతిహోమం, కలశస్థాపన, అష్టోత్తర కలశాభిషేకములు, సహస్రనామార్చన, అవాహితా దేవతా హోమాలను నిర్వహించారు. అదేవిధంగా మధ్యాహ్నం 12గంటలకు మహామంగళహారతి, కుంభప్రోక్షణ వంటి క్రతువులతో పాటు సాయంత్రం 8గంటలకు పడిపూజ, పల్లకిసేవ, మహామంగళహారతి, వేదస్వస్తి కార్యక్రమాలను చేపట్టారు. రాత్రి ఆలయానికి విచ్చేసిన భక్తులందరికి అల్పాహారం ఏర్పాటు చేశారు.

వైభవంగా శివాజీ పట్టాభిషేకం

శ్రీశైలం, జూన్ 20: శ్రీశైలంలో గురువారం ఛత్రపతి శివాజీ పట్టాభిషేకం మహోత్సవాన్ని శ్రీశైలం హిందూ పరిరక్షణ సమితి, బీజేపీ, ఆర్ఎస్ఎస్, శివాజీ స్ఫూర్తి కేంద్రం నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా క్షేత్ర పురవీధుల్లో కాషాయం తలపాగాలను ధరించి జై శివాజీ నినాదాలతో శోభాయాత్రను చేశారు. కార్యక్రమాన్ని పురస్కరించుకుని శివాజీ స్ఫూర్తికేంద్రంలో జరిగిన సభలో శివాజీ వీరగాధలను కొనియాడారు. అనంతరం క్రీడల్లో ప్రతిభ కనబరచి విజేతలుగా నిలిచిన విద్యార్థులకు స్థానిక సీఐ ప్రసాదరావు, ప్రముఖుల చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో శ్రీశైలం హిందూ పరిరక్షణ సమితి, బీజేపీ, ఆర్ఎస్ఎస్, శివాజీ స్ఫూర్తి కేంద్రం నిర్వాహకులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

'ప్రతి మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలి'

నందికొట్కూరు, జూన్ 20: గత ఖరీఫ్ సీజన్‌లో ఏర్పడిన వర్షాభావ పరిస్థితుల వల్ల నియోజకవర్గంలోని ప్రతి మండలం కరువు బారిన పడిందని, కాబట్టి ప్రతి మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలని సీపీఐ అనుబంధ ఏపీ రైతు సంఘం జిల్లా నాయకుడు వెంకటేశ్వర్లు కోరారు. నందికొట్కూరులోని వ్యవసాయశాఖ ఏడీఏ కార్యాలయం ముందు గురువారం రైతు సంఘం నాయకులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. పంట నష్ట పరిహారం, తాగునీటి సమస్య, స్థానిక పరిస్థితులను కేంద్ర కరువు బృందానికి వివరించాలన్నారు. కేంద్ర కరువు బృందం నంద్యాల జిల్లా కేంద్రంలో కరువు పరిశీలనకు వచ్చిందని, దీంతో నియోజకవర్గంలోని ప్రతి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించే విధంగా కలెక్టర్, జేసీ, ఎంపీ, ఎమ్మెల్యే జోక్యం చేసుకొని చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రైతు సంఘం నాయకులు గోపి, శివరాముడు, సోమన్న, శేఖర్, భరత్, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

'ఘర్షణలకు పాల్పడితే చర్యలు'

బండిఆత్మకూరు, జూన్ 20: గ్రామాల్లో ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని రూరల్ సీఐ శివకుమార్‌రెడ్డి హెచ్చరించారు. బండిఆత్మకూరు పోలీస్ స్టేషన్‌ను గురువారం సీఐ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల అనంతరం ప్రశాంత జీవం చేయాలని, లేని పక్షంలో ఘర్షణలకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ముఖ్యంగా యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, ఆరుబయట మద్యం తాగే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

ఘనంగా రెవెన్యూ దినోత్సవం



నందికొట్కూరు తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ డే కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయసూర్య



నంద్యాలలో కలెక్టర్ శ్రీనివాసులును సన్మానిస్తున్న రెవెన్యూ అధికారులు, సిబ్బంది

నంద్యాల (కల్చరల్), జూన్ 20: నంద్యాల కలెక్టరేట్‌లోని సెంటినరీ హాల్‌లో మొదటి సారిగా రెవెన్యూ దినోత్సవాన్ని అధికారులు గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రజాస్వామ్యంలో రెవెన్యూ శాఖ అత్యంత కీలకమైనదని, ప్రతి రెవెన్యూ ఉద్యోగి రోజురోజుకు విజ్ఞానాన్ని పెంపొందించుకొని విధులు నిర్వహిస్తే అద్భుతమైన ఫలితాలు ఉంటాయని కలెక్టర్ డా.కె.శ్రీనివాసులు అన్నారు. జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి, డీఆర్వో పద్మజ, ఆర్డీవోలు, రెవెన్యూ అసోసియేషన్ సభ్యులు, తహసీల్దారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో ఏ సంక్షోభం ఎదురైనా తొలుత రెవెన్యూశాఖ స్పందించి సమస్యను పరిష్కరించేందుకు సిద్ధంగా ఉంటుందన్నారు. అనంతరం రెవెన్యూ సర్వీసులలో ఉత్తమ సేవలందించిన సిబ్బందికి ప్రశంసా పత్రాలు కలెక్టర్, జేసీ, డీఆర్వో పంపిణీ చేశారు. అనంతరం విశ్రాంత ఉద్యోగులకు మెమెంటో ఇచ్చి శాలువా కప్పి సన్మానించారు.

నంద్యాల రూరల్: రెవెన్యూ కార్యాలయ సమీపంలోని రెవెన్యూ విశాంతి భవనంలో రెవెన్యూ దినోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి రెవిన్యూ అసోషియేషన్ జెండాను ఆవిష్కరించారు. డిప్యూటీ తహసీల్దార్‌లు నాగరాజు, శేఖర్, రాజశేఖర్, రెవున్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అనంతరం విశ్రాంత రెవెన్యూ అధికారులను, సిబ్బందిని సన్మానించారు.

నందికొట్కూరు రూరల్: దేశం ఆర్థికంగా ఎదగాలంటే కీలకమైనది రెవెన్యూశాఖ అని, అలాగే దేశంలో ఎన్నికలు నిర్వహిచాలంటే కీలక పాత్ర పోషించేది ఒక్క రెవెన్యూశాఖే అని నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య అన్నారు. గురువారం నందికొట్కూరు తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ దామోదరెడ్డి ఆధ్వర్యంలో రెవెన్యూ డేను కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే జయసూర్య మాట్లాడుతూ సమాజంలో అన్నిరంగాలలో కీలకమైనది ఒక్క రెవెన్యూ శాఖ అని చెప్పుకొచ్చారు. తహసీల్దార్ దామోదరెడ్డి మాట్లాడుతూ బ్రిటీష్ పాలన కాలంలోనే రెవెన్యూ వ్యవస్థను ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. వీఆర్వోల సంఘం రాష్ట్ర నాయకుడు నరసరాజు మాట్లాడుతూ భారతదేశంలో 1772లో వారన్ హేస్టింగ్ కలెక్టర్ వ్యస్థను తీసుకుని వచ్చి రెవెన్యూకు అనుసంధానించి భూమి శిస్తును సులభతరం చేశారని గుర్తుచేశారు. బ్రిటీష్ కాలంలో నుంచి రెవెన్యూ వ్యవస్థలో పనిచేస్తున్న తలారి సవారయ్య మాట్లాడుతూ అప్పట్లో న్యాయ రెవెన్యూ సదస్సును కలిపి కచేరి అని పిలిచేవారని అన్నారు. అందులో ఎవరు ప్రవేశించాలన్నా దండాలు దేవరా అంటూ నమస్కారం చేయాల్సిందే అని అప్పటి జ్ఞాపకాలను గుర్తుచేశారు.

పగిడ్యాల: పగిడ్యాల తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం రెవెన్యూ సిబ్బంది తహసీల్దార్ నాగేశ్వరరావు, మండల సర్వేయర్ శ్రీనివాసులు, వీఆర్వో దాసును డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్ ఆధ్వర్యంలో సన్మానించారు.

జూపాడుబంగ్లా: బ్రిటీష్‌కాలం నుంచి ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా రెవెన్యూశాఖ పనిచేస్తోందని తహసీల్దార్ బాబురాజేంద్రప్రసాద్ అన్నారు. జూపాడుబంగ్లా తహసీల్దార్ కార్యాలయంలో గురువారం రెవెన్యూ డే కార్యక్రమం నిర్వహించి కేక్‌కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. డిప్యూటీ తహసీల్దార్లు నాగన్న, చంద్రశేఖర్, ఆర్ఐ శ్రీరంగారెడ్డి, జూనియర్ అసిస్టెంట్ ఉమాదేవి, వీఆర్వోలు, వివిధ గ్రామాల నుంచి రైతులు పాల్గొన్నారు.

పాములపాడు: రెవెన్యూ దినోత్సవం నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించడం హర్షణీయమని తహసీల్దార్ వెంకటరమణ అన్నారు. గురువారం పాములపాడు తహసీల్దార్ కార్యలయంలో సిబ్బంది కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మిడుతూరు: మిడుతూరు తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ దినోత్సవాన్ని తహసీల్దార్ తులసమ్మ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. కేక్‌ను కట్ చేసి రెవెన్యూ అధికారులు వేడుకగా నిర్వహించుకున్నారు. డిప్యూటీ తహసీల్దార్ శానవాజ్, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ సుప్రియ, ఆర్ఐ బాషా, వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మకూరు: ప్రజాపరిపాలనలో రెవెన్యూ శాఖ ఎంతో కీలకమని ఆత్మకూరు తహసీల్దార్ కె.బాబు అన్నారు. గురువారం ఆత్మకూరు తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆశాఖ ఉద్యోగులు సంబరాలు జరుపుకొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బ్రిటీష్ పాలనకు ముందే మనదేశంలో రెవెన్యూ వ్యవస్థ ఉండేదని అన్నారు. ఆనాటి నుంచి నేటివరకు ప్రజాపరిపాలనలో రెవెన్యూ శాఖ అత్యంత కీలకంగా పనిచేస్తోందని వివరించారు. రెవెన్యూశాఖ సేవలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకే రెవెన్యూ దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం తొలిసారిగా ప్రవేశపెట్టినట్లు వివరించారు. అనంతరం కేక్ కట్ చేసి ఆనందాన్ని పంచుకోవడంతో పాటు రిటైర్డు తహసీల్దార్ మురళీమోహన్ సింగ్‌కు సత్కరించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.

పాణ్యం: రెవెన్యూ అధికారులు ఓర్పు, సహనంతో పనిచేయాలని పాణ్యం తహసీల్దారు ఫణికుమార్ అన్నారు. రెవెన్యూ దినోత్సవం సందర్భంగా గురువారం తహసీల్దారు కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. అనంతరం విశ్రాంత వీఆర్వో రాజశేఖరరావును ఘనంగా సత్కరించారు. కార్క్రమంలోడిప్యూటీ తహసీల్దార్ రమాదేవి, ఆర్ఐ మహేశ్వరరెడ్డి, సర్వేయర్, వీఆర్వోలు, వీఆర్ఏలు, సిబ్బంది పాల్గొన్నారు.

తూతూమంత్రంగా..

మహానంది: రెవెన్యూ దినోత్సవంను ఎంతో ఆర్భాటంగా నిర్వహించాల్సిన అధికారులు మహానందిలో మాత్రం గురువారం నామమాత్రంగా నిర్వహించారు. రెవెన్యూ డే పురష్కరించుకొని వ్యవసాయంలో అద్భుత ఫలితాలు సాధించిన రైతును రెవిన్యూ అధికారులు సన్మానించడం పరిపాటి. అలాంటి ఆలోచనకు స్వస్తి పలికి కార్యాలయానికి తన సొంత పనిమీద మండలంలోని బుక్కాపురం గ్రామానికి చెందిన రైతు వస్తే ఉన్న ఫలంగా శాలువాలు తెప్పించి తహసీల్దార్ రామచంద్రుడు, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులు సిబ్బంది సమక్షంలో ఆ రైతును సన్మానించి, హడావిడిగా కార్యాలయం ముందు గ్రూపు ఫొటో దిగడం ఆశ్చర్యానికి గురి చేసింది. కేవలం రిటైర్డ్ తహసీల్దార్ జనార్దన్‌శెట్టిని శాల్వతో సన్మానించారు. సిబ్బందితో మాత్రమే చిన్నపాటి సమావేశం నిర్వహించి ఇలా తూతూ మంత్రంగా రెవిన్యూ డే నిర్వహించడంపై అధికారుల తీరును పలువురు విమర్శించారు. డిప్యూటీ తహసీల్దార్ మాట్లాడుతూ శ్రీనివాసులు బుక్కాపురంకు చెందిన నాగరాజు అనే రైతుకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చామని చెప్పారు. సమయం లేకపోవడంతో పాత్రికేయిలకు సమాచారం ఇవ్వలేకపోయామని చెప్పారు.

పోషక యాజమాన్య పద్ధతులు పాటించాలి

డోన్(రూరల్), జూన్ 20: వేరుశనగ పంటలో నాణ్యమైన దిగుబడి కోసం పోషక యాజ మాన్య పద్ధతులు పాటించాలని డోన్ వ్యవసాయ శాఖ ఏడీఏ అశోక్‌వర్ధన్ రెడ్డి అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతులు వేసే వేరుశనగ పంటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. వేరుశనగలో అధిక శాతం నూనె ఉండటానికి సరైన పోషక యజమా న్యం అవసరమని అన్నారు. భూసార పరీక్షల ద్వారా నేలలో బోరాన్ లోపం ఉన్నదని తెలిస్తే ఎక రానికి 4 కిలోల బోరాక్స్‌ను విత్తేటప్పుడు వేసుకో వాలన్నారు.

భువనేశ్వరికి జన్మదిన శుభాకాంక్షలు




భువనేశ్వరికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న మంత్రి బీసీ దంపతులు, ప్యాపిలిలో..

బనగానపల్లె, జూన్ 20: రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, బీసీ ఇందిరమ్మ దంపతులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సతీ మణి నారా భువనేశ్వరికి బొకే ఇచ్చి జన్మదిన శుభాకాంక్షలు గురువారం తెలిపారు. ఈసందర్భంగా బీసీ జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ నారా భువనేశ్వరి ఎన్‌టీఆర్ ట్రస్ట్ ఛైర్మన్‌గా సేవలందించి లక్షలాది మందికి హెరిటేజ్ ద్వారా ఉపాధి చూపారని కొనియాడారు. ఎన్‌టీఆర్ ట్రస్ట్ ద్వారా ఆమె మరిన్ని సేవలందించి ఎంతోమందికి ఉపాధి కల్పించాలని ఆకాంక్షించారు.

ఘనంగా నారా భువనేశ్వరి జన్మదిన వేడుకలు

ప్యాపిలి: పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి జన్మదిన వేడుకలను డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా టీడీపీ నాయకులు కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. అనంతరం కోట్ల మాట్లాడుతూ టీడీపీ అధికారం లోకి రావడానికి నారా భువనేశ్వరి ఎంతో కృషి చేశారన్నారు. అంతకు ముందుగా పట్టణంలో ఓ ప్రైవేటు పాఠశాలను కోట్ల ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వై నాగేశ్వరరావుయాదవ్, లక్ష్మీనారాయణయాదవ్, గండికోట రామసుబ్బయ్య, రామ్మోహన్‌యాదవ్, అలేబాదు పరమేష్, చల్లా వీరాంజినేయులు, మధుకుమార్, దస్తగిరి, ఏనుగమర్రి రాము పాల్గొన్నారు.

అమరావతికి బయలుదేరిన ఎమ్మెల్యే కోట్ల



డోన్, జూన్ 20: డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి గురువారం అమరావతికి బయలుదేరి వెళ్లారు. శుక్రవారం నుంచి అసెంబ్లీ సమావేశాలు జరగనున్నాయి. తొలి రోజు ఎమ్మెల్యే లతో ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. ఇందుకు డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొనేందుకు బయలుదేరి వెళ్లారు. నేడు తొలిసారిగా అసెంబ్లీలో ఎమ్మెల్యేగా కోట్ల అడుగు పెట్టనున్నారు. ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు: ఎమ్మెల్యే కోట్ల



సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో ఎమ్మెల్యే కోట్ల

డోన్, జూన్ 20: చదువుతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని శ్రీసాయి గ్లోబల్ కంప్యూటర్ అండ్ ఎడ్యుకేషన్ అకాడమిలో జరిగిన కార్యక్రమా నికి ఎమ్మెల్యే కోట్ల ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కంప్యూటర్ శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఎమ్మెల్యే సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధ్యానం ఇస్తుందన్నారు. సీఎం చంద్రబాబు మెగా డీఎస్సీపై తొలి సంతకం చేసి 16,350 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తున్నారన్నారు. నేటి సమాజంలో కంప్యూటర్ పరిజ్ఞానం పెంచుకుంటేనే మంచి భవిష్యత్తు సాధ్యమన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వై.నాగేశ్వరరావు యాదవ్, డీసీఎంఎస్ మాజీ ఛైర్మన్ లక్ష్మీరెడ్డి, ఓబు లాపురం శేషిరెడ్డి, సాయి గ్లోబల్ సంస్థ నిర్వాహకులు ఇమిడి లక్ష్మణ్, సాయినాథ్ పాల్గొన్నారు.

ఏపీపీఎంఈఏ కోవెలకుంట్ల తాలుకా అధ్యక్షుడి ఎన్నిక

కోవెలకుంట్ల, జూన్ 20: ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మినిస్ట్రీ ఎలక్షన్ అసోసియేషన్ కోవెలకుంట్ల తాలుకా అధ్యక్షుడి ఎన్నిక పట్టణంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. కోవెలకుంట్ల పాత తాలుకా పరిధిలోని కొలిమిగుండ్ల, సంజామల, దొర్నిపాడు, ఉయ్యాలవాడ, కోవెలకుంట్ల మండలాలకు చెందిన పంచాయతీరాజ్ శాఖలోని ఉద్యోగులు సుమారు 40 మంది కలిసి పంచాయతీరాజ్ అధ్యక్షుడిగా ఎస్. సంజీవరాయుడును ఎన్నుకున్నారు.

పవన్ కళ్యాణ్‌ను కలిసిన భూమా అఖిలప్రియ



డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను కలిసిన ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, జగత్ విఖ్యాతరెడ్డి

చాగలమర్రి, జూన్ 20: ఉప ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన పవన్ కళ్యాణ్‌ను గురువారం ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, టీడీపీ యువనాయకుడు భూమా జగత్ విఖ్యాతరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని పలు సమస్యలను డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళ్లడంతో సమస్యలను పరిష్కరిస్తానని పవన్ కళ్యాణ్ భరోసా ఇచ్చారని భూమా అఖిలప్రియ అన్నారు.

మంత్రి బీసీని కలిసిన టీడీపీ నాయకుడు

కొలిమిగుండ్ల రూరల్, జూన్ 20: మండలంలోని అంకిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన టీడీపీ నేత గండా పరమేశ్వరరెడ్డి రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దనరెడ్డి గురువారం కలిశారు. విజయవాడలోని మంత్రి కార్యాలయంలో ఆయన మంత్రి బీసీని కలిసి ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు.

'బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేయాలి'

శిరివెళ్ల, జూన్ 20: బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేయాలని అంగన్‌వాడీ శిరివెళ్ల సెక్టార్ సూపర్‌వైజర్ సువర్ణలత అన్నారు. బాలసభ కార్యక్రమంలో భాగంగా శిరివెళ్ల జడ్పీ ఉన్నత పాఠశాలలోని విద్యార్థినులకు పలు అంశాలపై గురువారం ఆమె అవగాహన కల్పించారు. అనంతరం పాఠశాల నుంచి గ్రామంలో ర్యాలీ నిర్వహిం చారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

'బాలికల సంరక్షణ అందరి బాధ్యత'

చాగలమర్రి, జూన్ 20: బాలికల సంరక్షణ అందరి బాధ్యతని ఐసీడీఎస్ పీడీ నిర్మల అన్నారు. గురువారం చాగలమర్రి కస్తూర్బా పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే, యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. జిల్లా సూపరింటెండెంట్ రోజారాణి, సీడీపీవో తేజశ్వరి, ఎస్‌వో సునీత, హెచ్‌ఈ వెంకటమ్మ, సూపర్‌వైజర్ సుశీల, అంగన్‌వాడీలు పాల్గొన్నా రు.

దేవదాయ శాఖ మంత్రిని కలిసిన ఈవో

బేతంచెర్ల, జూన్ 20: రాష్ట్ర దేవదాయ శాఖ మాత్యులుగా బాధ్యతలు చేపట్టిన ఆనం నారాయణరెడ్డిని మర్యాదపూర్వకంగా మద్దిలేటి స్వామి క్షేత్రం ఉప కమిషనర్ ఆలయ ఈవో రామాంజనేయులు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ సమక్షంలో మద్దిలేటి స్వామి వారి శేషవస్త్రాన్ని, చిత్రపటాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఆళ్లగడ్డ అభివృద్ధే లక్ష్యం: ఎమ్మెల్యే

రుద్రవరం, జూన్ 20: ఆళ్లగడ్డ నియోజకవర్గం అభివృద్ధే లక్ష్యమని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. గురువారం రుద్రవరం టీడీపీ నాయకులు ఎమ్మెల్యేకు శాలువా, పూలమాలలతో సన్మానించి స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు చెప్పారు. కార్యక్రమంలో ఎల్‌వీ రంగనాయకులు, ప్రమీలమ్మ, పోలా గురుమూర్తి, కొమ్మలపాటి రాజారావు, ఏరువ కృష్ణమూర్తి, అన్నదాత ఓబులయ్య, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యేకు న్యాయవాదుల శుభాకాంక్షలు

ఆళ్లగడ్డ: ఆళ్లగడ్డ ఎమ్మెల్యే అఖిలప్రియను గురువారం సీనియర్ న్యాయవాది శివరామిరెడ్డి శాలువ, పూలమాలలతో అభినందించారు. న్యాయవాదులు గుర్రెడ్డి, బాషా, రామచంద్రుడు, మల్లికార్జునరెడ్డి ఉన్నారు.

చాగలమర్రి: ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియను గురువారం చాగలమర్రి మండలంలోని ముత్యాలపాడు, గొడిగనూరు, చాగలమర్రి టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ఆయా శాఖల అధికారులు ఆమె నివాసానికి తరలివెళ్లి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ నాయకులు జెట్టి నాగరాజు, శేఖర్‌రెడ్డి, రమణారెడ్డి మాట్లాడారు.

బుగ్గ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

సంజామల, జూన్ 20: నొస్సం గ్రామంలోని బుగ్గ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 16వ తేదీ నుంచి ప్రారంభమయ్యాయి. ఆలయ ఛైర్మన్ గాధం శెట్టి శ్రీరాములు ఆధ్వర్యంలో స్వామివారికి నిత్య బ్రహ్మోత్సవాలు అభిషేకాలు పూజలు నిర్వహిస్తున్నారు. వేడుకల్లో భాగంగా గురువారం స్వామివారికి హనుమంత వాహనసేవ నిర్వహించారు.

నాటు సారా విక్రేతల అరెస్టు

కొలిమిగుండ్ల రూరల్, జూన్ 20: ఇద్దరు నాటు సారా విక్రేతలను అరెస్ట్ చేసినట్లు కొలిమిగుండ్ల సీఐ గోపినాథ్‌రెడ్డి తెలిపారు. కొలిమిగుండ్ల మండల కేంద్రానికి చెందిన ఉలువల రామలక్ష్మయ్య అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని 8 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. అదేవిధంగా మండలంలోని తుమ్మల పెంట గ్రామంలో అయ్యగాళ్ల రాజు అనే వ్యక్తిని గతంలో నమోదు చేసిన సారా కేసులో అరెస్ట్ చేసినట్లు ఆయన తెలిపారు.